# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 26 - ఆగస్టు - 2026 | సంపుటి : 4 | సంచిక : 83 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



ల్యాండ్ పూలింగ్ విధానానికి రూపకల్పన

ఫేజ్-2 పనులకు త్వరలో టెండర్లు

పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాజెక్టులపై దృష్టి

సీఎం రేవంత్ రెడ్డి

# మూసీ భూసేకరణకు వేగం పెంచాలి: రేవంత్



**హైదరాబాద్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):**

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు అమలును వేగవంతం చేయడానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ప్రాజెక్టు అమలులో ఎలాంటి జాప్యం లేకుండా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. భూసేకరణ విషయంలో సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణలో ల్యాండ్ పూలింగ్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులు, భూ యజమానుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణకు సంబంధించి చట్టబద్ధమైన మార్గదర్శకాలను రూపొందించి భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన

మిగతా 2లో..

## 22ఏ బాధితుల ఆవేదనపై హరీశ్ రావు ధ్వజం

- ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శ
- మంత్రి పొంగులేటి లక్ష్యంగా తీవ్ర ఆరోపణలు
- 22ఏ జాబితా నుంచి భూములు తొలగించాలని డిమాండ్



**హైదరాబాద్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల సమస్యపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి పాల్గొన్న ఆయన, ప్రభుత్వ విధానాల వల్ల వేలాది

మిగతా 2లో..




## జపాన్ పెట్టుబడులకు తెలంగాణ ఆహ్వానం

- పెట్టుబడులకు అన్ని విధాల సహకారం
- తెలంగాణ యువతకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు
- నైపుణ్య మానవ వనరులపై భాగస్వామ్యం
- ఒసాకాలో ఇండియా–జపాన్ రౌండ్‌టేబుల్ సమావేశం

2లో

## ఫీజు బకాయిలపై బీజేపీ పోరాటం

- మహా నిరాహార దీక్ష విజయవంతంగా ముగింపు
- విద్యార్థుల హక్కుల సాధనకే ఉద్యమం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు డిమాండ్
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

మిగతా 2లో..



## మొక్కలతో పచ్చని తెలంగాణ నిర్మాణం

- ప్రత్యేక వనమహోత్సవంలో మొక్కలు నాటిన మంత్రి
- పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం
- భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం లక్ష్యం
- మొక్కల సంరక్షణపై అవగాహన కల్పింపు

**వరంగల్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):**


ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్క నాటి పచ్చని తెలంగాణ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ పరిధిలోని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించాలంటే విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

మిగతా 2లో..



## టిమ్స్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం


- మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహణ
- వైద్య సేవల విస్తరణపై చర్చ
- సంస్థ అభివృద్ధికి కార్యాచరణపై సమీక్ష



**హైదరాబాద్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):**

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ (టిమ్స్) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో జరిగిన ఈ సమావేశంలో సంస్థ అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, పరిపాలనా అంశాలపై చర్చించారు.

మిగతా 2లో..




## డిసెంబర్‌లో రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు

- ఎస్ఐఆర్ పూర్తయ్యాక ఎన్నికల ప్రక్రియకు అవకాశం
- ఐదు కార్పొరేషన్లపై ప్రత్యేక దృష్టి
- పెండింగ్ మున్సిపాలిటీలకూ ఎన్నికల నిర్వహణ యోచన

**హైదరాబాద్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికలను ఈ ఏడాది డిసెంబర్ నెలలో నిర్వహించే దిశగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌పై నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార వర్గాల్లో జరుగుతున్న చర్చల ప్రకారం డిసెంబర్‌లో కీలక పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అంశం పరిశీలనలో ఉంది. ఈ దశలో సైబరాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్,

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జపాన్ పెట్టుబడులకు తెలంగాణ ఆహ్వానం

**ఒసాకా, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ కంపెనీలు ముందుకు రావాలని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి ఆహ్వానించారు. జపాన్ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెడితే ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని, పెట్టుబడులు సురక్షితంగా, లాభదాయకంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా వేగంగా ఎదుగుతోందన్నారు. జపాన్‌లోని ఒసాకాలో నిర్వహించిన 'లెవరేజింగ్ ఇండియన్ టాలెంట్' ఇండియా-జపాన్ వర్క్‌ఫోర్స్ రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జపాన్ పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థల ప్రతినిధులు, విద్యా సంస్థల ప్రతినిధులతో తెలంగాణలో పెట్టుబడులు, నైపుణ్య మానవ వనరులు, ఉపాధి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.

తెలంగాణలో ఐటీ, ఇంజినీరింగ్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ రంగాల్లో ప్రపంచ స్థాయి ప్రతిభ అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 600 ఎకరాల్లో కొత్త పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసేందుకు జపాన్ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. ఇది తెలంగాణపై జపాన్ పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. పెట్టుబడులతో పాటు తెలంగాణ యువతకు జపాన్‌లో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉపాధికి అవసరమైన నైపుణ్యాలు, భాషా శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు.

డిసెంబర్ 2026లో నిర్వహించనున్న 'రైజింగ్ తెలంగాణ' సదస్సుకు జపాన్ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు హాజరు కావాలని శక్తి శాఖ కార్యదర్శి హరిచందన ఆహ్వానించారు. తెలంగాణ యువతకు సురక్షితమైన విదేశీ ఉపాధి అవకాశాల కల్పనలో టామ్‌కామ్ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. భారత్-జపాన్ సంబంధాల బలోపేతంలో వర్క్‌ఫోర్స్ మొబిలిటీ కీలకమని ఒసాకా-కోబే భారత కాన్సుల్ జనరల్ చంద్రు అప్పర్ పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్లలో జపాన్‌కు భారీ స్థాయిలో నైపుణ్య మానవ వనరుల అవసరం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జపాన్ పరిశ్రమల ప్రతినిధులు, భారత-జపాన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మూసీ భూసేకరణకు వేగం పెంచాలి: రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు రెండో దశ పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, నది సుందరీకరణ లక్ష్యాలతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రెండో దశ పనులు ప్రారంభమైతే మూసీ పరివాహక ప్రాంతాల అభివృద్ధి మరింత వేగం అందుకుంటుందని అధికారులు సమావేశంలో వివరించారు. మూసీ రివర్‌ఫ్రంట్ పరిధిలో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టులకు అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. తక్కువ వడ్డీ రుణాలను పొందేందుకు మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే అభివృద్ధి పనుల కోసం టీడీఆర్‌ల జారీ ప్రక్రియను క్రమం తప్పకుండా సమీక్షిస్తూ ప్రతి వారం పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. ప్రాజెక్టుల అమలులో పారదర్శకత, వేగం రెండూ సమానంగా ఉండాలని పేర్కొన్నారు. గండిపేట మంచిరేవుల సమీపంలో నిర్మించనున్న ఓంకారేశ్వరస్వామి ఆలయానికి వెంటనే టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. అదే విధంగా కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌ను రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పర్యాటకులను ఆకర్షించేలా అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమం హైదరాబాద్ నగర భవిష్యత్తును మార్చే కీలక ప్రాజెక్టుగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నది పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత, నగర సుందరీకరణ, పర్యాటకాభివృద్ధి లక్ష్యాలను ఒకే వేదికపై సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

# డిసెంబర్‌లో రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 2026లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయా సంస్థల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది.

హైదరాబాద్ మహానగర పునర్వ్యవస్థీకరణ తర్వాత ఏర్పాటైన సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లకు ఇప్పటివరకు ప్రజాప్రతినిధుల ఎన్నికలు జరగలేదు. దీంతో ఈ రెండు కొత్త కార్పొరేషన్లకు తొలి ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీలతో పాటు ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది.మరోవైపు వివిధ న్యాయ, పరిపాలనా కారణాలతో ఎన్నికలు జరగని అచ్చంపేట, మందమర్రి, మణుగూరు, నకిరేకల్, కొత్తూరు, సిద్ధిపేట మున్సిపాలిటీలకు కూడా ఇదే విడతలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ మున్సిపాలిటీల ఎన్నికలు ఫిబ్రవరి ఎన్నికల షెడ్యూల్‌లో భాగం కాలేదు.

ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటరు జాబితా సిద్ధం కానుంది. అనంతరం వార్డుల వారీగా ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల ఖరారు, ఎన్నికల సిబ్బంది నియామకం వంటి ప్రక్రియలు వేగవంతం కానున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లపై ఇప్పటికే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. డిసెంబర్‌లో ఎన్నికలు జరిగితే రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి వంటి పట్టణ ప్రాంతాల్లో జరిగే ఎన్నికలు అన్ని ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి. అధికారిక షెడ్యూల్‌పై ఇంకా స్పష్టత రానప్పటికీ, రాజకీయ పార్టీలు మాత్రం ఇప్పటికే ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతున్నాయి

# ఫీజు బకాయిలపై బీజేపీ పోరాటం

**హైదరాబాద్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం భారతీయ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమం మరో కీలక దశకు చేరుకుంది. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేపట్టిన మహా నిరాహార దీక్ష విజయవంతంగా ముగిసినట్లు పార్టీ నేతలు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే ఈ దీక్ష ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఆరోపించింది. విద్యార్థుల ఉన్నత విద్యకు సంబంధించిన కీలక అంశంపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బకాయిలు విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు చదువులు కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. నిన్న ప్రారంభమైన మహా నిరాహార దీక్ష ఈరోజు ముగిసింది. పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎన్. రాంచందర్ రావుకు నిమ్మరసం అందించి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన కోరారు. విద్యా రంగానికి సంబంధించిన సమస్యలను రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతో కీలకమని బీజేపీ నేతలు తెలిపారు. బకాయిల చెల్లింపులో జాప్యం కారణంగా తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ తక్షణమే విడుదల చేయాలని పార్టీ కోరింది. రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు ఈ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపింది. సమస్య పరిష్కారం కోసం అవసరమైతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది.




విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేసే వరకు ఉద్యమం ఆగదని వెల్లడించింది. విద్యార్థుల విద్యకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది.

# 22ఏ బాధితుల ఆవేదనపై హరీశ్ రావు ధ్వజం

(మొదటి పేజీ తరువాయి)

మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి వారిని కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితికి నెట్టివేశారని అన్నారు. సమావేశంలో మాట్లాడిన హరీశ్ రావు, వందలాది కాలనీల ప్రతినిధులు, వేలాది మంది బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలనే ఆశతో సమావేశానికి హాజరయ్యారని తెలిపారు. భూములను 22ఏ జాబితాలో చేర్చింది ప్రభుత్వమే అయితే, వాటిని తొలగించుకోవడానికి ప్రజలు దరఖాస్తులు చేసుకుంటూ తిరగడం ఎందుకని ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలు తీసుకుని, తర్వాత బాధ్యతను వారి మీద మోపడం సరికాదని వ్యాఖ్యానించారు.

లక్షలాది మంది ఆస్తులను ఒకే నిర్ణయంతో నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. భూములపై హక్కులు ఉన్నప్పటికీ వాటిని విక్రయించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో ఆస్తుల విలువలు తగ్గిపోయి, అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం పొందలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై కూడా హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. భూములను 22ఏ జాబితాలో చేర్చడం వెనుక కమిషన్ల రాజకీయాలు ఉన్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రజల జీవితాలు అస్తవ్యస్తమవుతున్నాయని, దీనికి బాధ్యత వహించాల్సింది అధికార యంత్రాంగమేనని అన్నారు.

22ఏ జాబితాలో భూములు ఉండటంతో అనేక కుటుంబాల సామాజిక, ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటున్నాయని ఆయన పేర్కొన్నారు. పిల్లల పెళ్లిళ్లు జరపడానికి, వైద్య అవసరాల కోసం రుణాలు పొందడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. బ్యాంకులు సైతం ఆస్తులను తాకట్టు స్వీకరించకపోవడంతో బాధితులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రజలతో మళ్లీ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వమే సమగ్ర సమీక్ష నిర్వహించి అర్హుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. ప్రజల ఆస్తి హక్కులను కాపాడడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే బాధితుల తరఫున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మొక్కలతో పచ్చని తెలంగాణ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

నాటిన ప్రతి మొక్కను పెంచి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దినప్పుడే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. పచ్చదనం పెరగడం ద్వారా వాతావరణ సమతుల్యత కాపాడటంతో పాటు ప్రజారోగ్యానికి కూడా మేలు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత మొక్కల పెంపకంలో చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. వనమహోత్సవ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పచ్చని తెలంగాణ లక్ష్య సాధనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని మంత్రి కోరారు.

# టిమ్స్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. సంస్థ భవిష్యత్ కార్యాచరణ, సేవల మెరుగుదలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అలాగే వైద్య విద్యా సంచాలకురాలు డాక్టర్ వాణి, ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో వైద్య సేవల బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. టిమ్స్ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల నాణ్యత, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సిబ్బంది అవసరాలు, రోగులకు మెరుగైన సేవలు అందించే అంశాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలపై అధికారులు సూచనలు చేశారు. వైద్య విద్య, పరిశోధన, ప్రత్యేక వైద్య విభాగాల అభివృద్ధికి సంబంధించిన అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా టిమ్స్ సంస్థలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ప్రజారోగ్య రంగాన్ని మరింత అభివృద్ధి చేసి నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సమావేశంలో పేర్కొన్నారు. టిమ్స్ సంస్థలను వైద్య రంగంలో ఆదర్శవంతమైన సంస్థలుగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులు నిర్ణయించారు.

# ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలపై కఠిన హెచ్చరిక



- **విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**
- **కాలేజీలతో హైడ్రా–ఇంటర్ బోర్డు సంయుక్త సమావేశం**
- **రెండేళ్లకోసారి రెన్యూవల్‌కు వెసులుబాటు పరిశీలన**

**హైదరాబాద్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని హైడ్రా, ఇంటర్మీడియట్ విద్యా మండలి స్పష్టం చేశాయి. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీల వ్యవహారం నేపథ్యంలో ఇంటర్మీడియట్ కళాశాలల యాజమాన్యాలతో సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో అధికారులు పలు కీలక సూచనలు చేశారు. అనుకోని అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది సురక్షితంగా బయటపడేలా అన్ని విద్యాసంస్థలు తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. అవసరమైన చోట భవనాల్లో మార్పులు, చేర్పులు చేపట్టి భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ మాట్లాడుతూ ఫేక్ ఫైర్ ఎన్‌వోసీల పేరిట కళాశాలల యాజమాన్యాలను ఇబ్బంది పెట్టడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. అయితే విద్యార్థుల ప్రాణ భద్రతకు ముప్పు కలిగించే చర్యలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఫైర్ భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా రెండో మెట్ల మార్గం ఏర్పాటు వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. పాత భవనాల్లో సాంకేతిక పరిమితులు ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని పేర్కొన్నారు. కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా సమావేశంలో అధికారులు తెలుసుకున్నారు. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలు సమర్పించడానికి దారితీసిన కారణాలపై ఆరా తీశారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తూనే విద్యాసంస్థలకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కళాశాలల అభ్యర్థన మేరకు ప్రతి ఏడాది కాకుండా రెండేళ్లకోసారి ఫైర్ ఎన్‌వోసీ రెన్యూవల్‌కు అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు హైడ్రా కమిషనర్ వెల్లడించారు. ఫైర్ ఎన్‌వోసీలు, వాటి పునరుద్ధరణ కోసం హైడ్రా అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మధ్యవర్తులు, బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అనుమతుల జారీ, పునరుద్ధరణ, ఫీజుల చెల్లింపులు అన్నీ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతాయని వివరించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని విద్యాసంస్థలు ఈ విధానాన్ని తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ఫేక్ ఫైర్ ఎన్‌వోసీల వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరు అనే అంశంపై లోతైన దర్యాప్తు కొనసాగుతోందని హైడ్రా కమిషనర్ తెలిపారు. ఇందులో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి కళాశాల యాజమాన్యం తమ వద్ద ఉన్న ఫైర్ ఎన్‌వోసీలు నిజమైనవేనా కాదా అనే విషయాన్ని స్వయంగా ధృవీకరించుకోవాలని సూచించారు. భద్రతా నిబంధనల అమలులో నిర్లక్ష్యానికి తావు లేదని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలు సమర్పించిన కళాశాలలపై విధించిన రూ.8 లక్షల జరిమానా అంశాన్ని కూడా పునఃసమీక్షిస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యమని, విద్యాసంస్థలను మూసివేయడం లేదా ఇబ్బందులకు గురిచేయడం తమ ఉద్దేశం కాదన్నారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తూ విద్యార్థులకు సురక్షిత విద్యా వాతావరణం కల్పించేందుకు అన్ని కళాశాలలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హైడ్రా, ఇంటర్ బోర్డు సంయుక్తంగా పిలుపునిచ్చాయి.

## చింతల్ తండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి



**వేలేరు, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):**వేలేరు మండలం చింతలతండా గ్రామంలో మంగళవారం నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాలోతు రాజు, రేషన్ డీలర్ జోడుముంతల రంజిత్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాలోతు రాజు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు రేషన్ కార్డులు అందుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు.

## పీచరలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**వేలేరు, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు)** వేలేరు మండలం పీచర గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సర్పంచ్ మరిజె అనిత నర్సింగరావు పాల్గొన్నారు రేషన్ డీలర్లు మోరే విజయపాల్, రామంచ అశోక్ ఆధ్వర్యంలో రేషన్ కార్డులా పంపిణి నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.
స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ రేషన్ సేవలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొలిపాక వెంకటేష్, ఉప్పుల శ్రీధర్‌రెడ్డి, గుడికందుల రాకేష్, వొద్దుల శ్రీకాంత్, ఎడ్ల అశ్వినితో పాటు గ్రామ పెద్దలు, రేషన్ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



- **రేవల్లి మండల విద్యాధికారి వరప్రసాద్ రావు**

**రేవల్లి ఆగస్టు25(తెలంగాణ ముచ్చట్లు):** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వనపర్తి జిల్లా రేవల్లి మండల విద్యాధికారి ఎస్. వరప్రసాద్ రావు అన్నారు. రేవల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. రేవల్లి మండలంలో దాదాపు 100 మొక్కలు నాటినట్లు తెలిపారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను అందరూ తీసుకోవాలని వరప్రసాద్ రావు సూచించారు. కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారిణి కుమారి కీర్తన, సర్పంచ్ రాజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పర్వతాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. ప్రసాద్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజ, ఉప సర్పంచ్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగుడు రాహుల్‌కు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వాలి

- **తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి స్టేట్ జనరల్ సెక్రెటరీ మెరుగు శివకృష్ణ ఎమ్మెల్యే గారికి విజ్ఞప్తి చేశారు**



**ఆగస్టు 25 , మల్కాజిగిరి, (తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింహాద్రి నగర్, చంద్రగిరి కాలనీకి చెందిన 21 ఏళ్ల దివ్యాంగుడు రాహుల్‌కు ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మెరుగు శివకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు.రాహుల్ పుట్టినప్పటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతూ వీల్‌చైర్‌కే పరిమితమై ఉన్నాడు. తన కుమారుడి వైద్యం కోసం ఎన్నో సంవత్సరాలుగా తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు వర్ణనాతీతమని మెరుగు శివకృష్ణ పేర్కొన్నారు.
రూ.70 లక్షలకు పైగా వైద్య ఖర్చులు.. ఇల్లు కూడా అమ్ముకున్న తల్లిదండ్రులు
రాహుల్ తల్లిదండ్రులు రాధా, తిరుమలరావు మాట్లాడుతూ.. తమ కుమారుడు పుట్టినప్పటి నుంచి అతని వైద్యం కోసం ఇప్పటివరకు రూ.70 లక్షలకు పైగా ఖర్చు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడి ప్రాణాలు, ఆరోగ్యం కోసం తమకు ఉన్న సొంత ఇల్లును సైతం అమ్ముకోవాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు.ప్రస్తుతం రాహుల్‌కు ఉండటానికి సొంత ఇల్లు కూడా లేదని, వీల్‌చైర్‌పై జీవనం సాగిస్తున్న తమ కుమారుడికి సరైన వసతి కల్పించడం తమకు పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. ప్రభుత్వం తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని రాహుల్ పేరుపై డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకున్నారు.
ఎమ్మెల్యే దృష్టికి రాహుల్ కుటుంబ సమస్య
ఈ నేపథ్యంలో తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో, మల్కాజిగిరి బీఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు లక్ష్మీ ఆనంద్ చొరవతో రాహుల్ కుటుంబ సమస్యను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.
రాహుల్ కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితులను తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మానవతా దృక్పథంతో సానుకూలంగా స్పందించారు. రాహుల్‌కు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేసే విషయమై కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు.
కలెక్టర్‌కు ఫోన్ చేసి ఇల్లు ఇప్పించాలని విజ్ఞప్తి అంతేకాకుండా, రాహుల్ కుటుంబానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో తక్షణమే రిక్వెస్ట్ లెటర్ అందజేసి, కలెక్టర్‌కు ఫోన్ చేసి రాహుల్‌కు ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు మెరుగు శివకృష్ణ తెలిపారు.
దివ్యాంగులు, పేదలు, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి వారి సమస్యలను పరిష్కరించేందుకు మర్రి రాజశేఖర్ రెడ్డి ముందుండి పనిచేస్తున్నారని మెరుగు శివకృష్ణ పేర్కొన్నారు. రాహుల్ వంటి దివ్యాంగుడికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే అతని కుటుంబానికి ఎంతో ఊరట లభిస్తుందని అన్నారు. రాహుల్‌కు ప్రభుత్వం అండగా నిలవాలి
వీల్‌చైర్‌కే పరిమితమైన రాహుల్ కుటుంబ పరిస్థితిని ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని, మానవతా దృక్పథంతో వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని మెరుగు శివకృష్ణ డిమాండ్ చేశారు. దివ్యాంగులకు కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా, గౌరవంగా జీవించేందుకు అవసరమైన నివాస వసతి కూడా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉద్యమకారుడు నర్సింగ్, వెంకన్న రామ్ యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ బలగం టీవీ సీఈఓ చింతల విజయ్, స్టార్ న్యూస్ టీవీ నైన్ రఘు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదీ

- **జిల్లా అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్(లోకల్ బాడీస్)**



**వనపర్తి,ఆగస్టు25(తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. కీమ్యా నాయక్ సూచించారు. మంగళవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ అలవాటుగా చేసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అనుకూలమైన వాతావరణ పరిస్థితులను సద్వినియోగం చేసుకుని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి రఘునాథ్ రెడ్డి, ఎంపీడీవో, స్థానిక సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ




**జవహర్‌నగర్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):** సీపీఎం పార్టీ జవహర్‌నగర్ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యా సదస్సు పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి శివనారాయణ మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీన మేడ్చల్ జిల్లా బాచుపల్లి ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి లీల సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో జిల్లా విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యా రంగానికి సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు మేధావులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, కవులు, కార్మికులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కర్నే సురేందర్ మాట్లాడుతూ.. విద్యా రంగానికి కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో 6 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు అవసరమైన భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.
అదేవిధంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని, ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎంఎల్ చంద్ర పుల్లారెడ్డి వర్గం జాతీయ కార్యదర్శి షేక్ శవాళి, సీపీఎం నగర నాయకులు నగేష్, సంధ్య, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టీ. కాలేశు, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు

- **చొప్పదండి మండలం నుంచి 12 మంది విద్యార్థుల ఎంపిక**



**చొప్పదండి,ఆగష్టు 25(తెలంగాణ ముచ్చట్లు ):** క్రీడా రంగంలో రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటారు. హనుమకొండలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు చొప్పదండి మండలం రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల డైరెక్టర్ కర్ర రాజు, ప్రిన్సిపల్ కె. శ్రీనివాస్ తెలిపారు.
రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థులు జూనియర్ త్రో, లాంగ్ జంప్, హై జంప్ తదితర విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తూ పాఠశాల యాజమాన్యం అందిస్తున్న శిక్షణ, ప్రోత్సాహం కారణంగా విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.
చిన్న వయస్సులోనే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పాఠశాల డైరెక్టర్ కర్ర రాజు, ప్రిన్సిపల్ కె. శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.
అలాగే రాష్ట్ర స్థాయిలో ప్రతిభను నిరూపించుకుని జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు.
రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన 12 మంది విద్యార్థులను ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# గన్నేరువరంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



- సంక్షేమ పథకాలు అందేలా చర్యలు: ఎమ్మెల్యే

**కరీంనగర్,ఆగస్టు 25(తెలంగాణ ముచ్చట్లు ):** గన్నేరువరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించినట్లు తెలిపారు.
కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాలతో పాటు 8 రకాల ప్రత్యేక ఫీచర్లు, క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని కల్పించినట్లు చెప్పారు. వాటర్, ఫైర్ రెసిస్టెంట్ విధానంలో కార్డులను రూపొందించడం వల్ల ఎక్కువ కాలం సురక్షితంగా ఉంటాయని వివరించారు.
అర్హులైన ప్రతి కుటుంబాన్ని రేషన్ కార్డుల పరిధిలోకి తీసుకువచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.
కార్డుల పంపిణీతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# బి.పి. మండల్ జయంతి ఘనంగా నిర్వహణ



- బీసీల హక్కుల కోసం మండల్ పోరాటం చిరస్మరణీయం

**హనుమకొండ,ఆగష్టు 25(తెలంగాణ ముచ్చట్లు ):** బి.పి. మండల్ జయంతి కార్యక్రమాన్ని బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుడికాల బాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బి.పి. మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుడికాల బాస్కర్ మాట్లాడుతూ బీసీల సామాజిక, విద్యా, ఆర్థిక అభ్యున్నతి కోసం బి.పి. మండల్ విశేషంగా కృషి చేసిన మహనీయుడని అన్నారు. వెనుకబడిన తరగతులకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, రిజర్వేషన్లు కల్పించేందుకు మండల్ చేసిన పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. బీసీల అభివృద్ధి కోసం ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.
బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మండల్ ఆశయాల సాధన కోసం బీసీ ఆజాది ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.
కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జినుకల లక్ష్మణరావు, బీసీ ఆజాది స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంజాల రేవంత్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు సింహాద్రి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు శివ, ఫెడరేషన్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల గ్రామ మహిళా సంఘం నూతన కమిటీ ఎన్నిక




- నూతన అధ్యక్షురాలిగా పద్మ

**పెద్దమందడి,ఆగస్టు25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో సర్పంచ్ రాజమహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా సంఘం అధ్యక్షురాలిగా పద్మ, ప్రధాన కార్యదర్శిగా శాంతమ్మ, కోశాధికారిగా శైలజను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ, మహిళా సంఘాన్ని మరింత బలోపేతం చేసి సభ్యుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మహిళలందరినీ సంఘంలో భాగస్వాములను చేస్తూ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రుణాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా సీసీ బాలశివుడు మాట్లాడుతూ.. మహిళలు మహిళా సంఘాల ద్వారా పొందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తూ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు మహిళా సంఘాలు కీలకంగా పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజమహేందర్ రెడ్డి, సీసీ బాలశివుడు, మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రణవ్, సుహాసిని వినతి



**హుజురాబాద్,ఆగష్టు 25(తెలంగాణ ముచ్చట్లు ):** నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ వొడితల ప్రణవ్ బాబు, హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.
మంగళవారం సైదాపూర్ మండల పరిధిలోని ఆకునూరు గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి హుజురాబాద్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, పారిశుధ్యం, పట్టణ అభివృద్ధి తదితర అంశాలపై దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.
హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందించాలని ప్రణవ్ బాబు, సుహాసిని మనోజ్ రావు మంత్రిని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తున్నామని వారు తెలిపారు.
వినతిపత్రంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి, హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపుపై హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి అభివృద్ధి పనులకు సహకరిస్తామని హామీ ఇవ్వడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల దీక్షలకు సీపీఎం మద్దతు

- రూ.26 వేల వేతనం ఇవ్వాలి: వాసుదేవరెడ్డి



**కరీంనగర్,25(తెలంగాణ ముచ్చట్లు ):** జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆయన మద్దతు తెలిపారు.
ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంతో పాటు వివిధ సేవలు అందిస్తున్న కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.
కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరిపి పరిష్కారం చూపాలని అన్నారు. కార్మికుల హక్కుల కోసం సీపీఎం నిరంతరం అండగా ఉంటుందని వాసుదేవరెడ్డి స్పష్టం చేశారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి,ఆగస్టు25(తెలంగాణ ముచ్చట్లు):** మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు మెరుగైన వాతావరణాన్ని అందించవచ్చని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.మంగళవారం వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామంలోని అటవీ శాఖ పరిధిలోని ప్రకృతి వనాన్ని కలెక్టర్ సందర్శించారు. వన మహోత్సవంలో భాగంగా నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కను నాటారు. జిల్లాకు నిర్దేశించిన 17 లక్షల మొక్కల నాటే లక్ష్యాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి సంరక్షించాలని ఆదేశించారు.మొక్కలు వాతావరణ సమతుల్యత, భూగర్భ జలాల పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.
అనంతరం నాచహళ్లి గ్రామంలో రైతు విజయ్ వ్యవసాయ భూమిలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ పరిశీలించారు. వర్షపు నీటిని పొలాల్లోనే నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను రీచార్జ్ చేసుకోవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులు ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు పొలంలో మొక్కను నాటిన కలెక్టర్, వ్యవసాయ భూముల వద్ద విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో, సవాయిగూడెం సర్పంచ్ యామిని, నాచహళ్లి సర్పంచ్ అబ్దుల్లా, అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిరంజన్‌రెడ్డిని విమర్శించే స్థాయి మేఘారెడ్డికి లేదు

- దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి
- మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, రాళ్ల కృష్ణయ్య




**పెద్దమందడి,ఆగస్టు25(తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్యే మేఘారెడ్డికి లేదని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.ఖిల్లా ఘనపూర్ మండలంలోని ఎగువ ప్రాంత గిరిజన తండాలకు సాగునీరు అందించడంలో నిరంజన్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని వారు పేర్కొన్నారు. కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కేసీఆర్, నిరంజన్‌రెడ్డి కృషితోనే సాధ్యమైందని, ఈ విషయం స్థానిక గిరిజనులకు స్పష్టంగా తెలుసన్నారు.నియోజకవర్గంలో గతంలో జరిగిన అభివృద్ధిని, ప్రజాప్రతినిధుల కృషిని పక్కనపెట్టి నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి ప్రోటోకాల్ ఇచ్చి స్థానిక నియోజకవర్గ ప్రతిష్ఠను దిగజార్చుతున్నారని ఆరోపించారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గైర్హాజరు కావడంపై కూడా వారు ప్రశ్నలు సంధించారు. లిఫ్ట్ ద్వారా లబ్ధి పొందిన రైతులను కార్యక్రమానికి ఆహ్వానిస్తే నిరంజన్‌రెడ్డికి పేరు వస్తుందనే ఉద్దేశంతో స్థానిక ప్రజాప్రతినిధులను అవమానించారని ఆరోపించారు. మిగిలిన కాలువల నిర్మాణానికి అవసరమైన ఫారెస్ట్ అనుమతులు సాధించి పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా ఘనపూర్ మండలంలోని అధ్వానంగా మారిన రహదారులను పట్టించుకోకుండా లిఫ్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు మంత్రులను తీసుకురావడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రూ.2 వేల కోట్లతో అభివృద్ధి చేశానని చెబుతున్నారని, నిజంగా అంత నమ్మకం ఉంటే పదవికి రాజీనామా చేసి ప్రజల తీర్పు కోరాలని సవాల్ విసిరారు.నిరంజన్‌రెడ్డి చేసిన సాగునీటి అభివృద్ధిని ప్రజలు మరిచిపోరని, ఆయనను విమర్శించడం మానుకోకపోతే గతంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత పరిస్థితులపై ప్రజల ముందు వాస్తవాలను వెల్లడిస్తామని కృష్ణానాయక్, రాళ్ల కృష్ణయ్య హెచ్చరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 26 - ఆగస్టు - 2026


# సురవరం ప్రతాప్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



- **వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణుల ఘన నివాళి**

**వనపర్తి,ఆగస్టు25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి తొలి ఎమ్మెల్యే, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. వనపర్తిలోని సురవరం ప్రతాప్‌రెడ్డి పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సురవరం ప్రతాప్‌రెడ్డి తెలంగాణ సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ వైతాళికుడిగా, ప్రముఖ సాహితీవేత్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, పాత్రికేయుడిగా ఆయన అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. 'గోల్కొండ' పత్రికను స్థాపించి తెలంగాణ ప్రజల సమస్యలను, సామాజిక అంశాలను వెలుగులోకి తీసుకువచ్చిన బహుముఖ ప్రజ్ఞాశాలిగా సురవరం ప్రతాప్‌రెడ్డి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్ర, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్రజా జీవితంలోనూ, సాహిత్య రంగంలోనూ ఆయన వేసిన ముద్ర చిరస్థాయిగా నిలిచిపోతుందని నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, కురుమూర్తి యాదవ్, ఏర్వ అరుణశ్రీనివాసులు, చంద్రశేఖర్ నాయక్, గులాం ఖాదర్ ఖాన్, జోహెబ్ హుస్సేన్, షేక్ జహంగీర్, నీలస్వామి, బొబ్బిలి ప్రేమ్‌కుమార్, వెంకట్ సాగర్, మంద రాము, చిట్యాల రాము, అరీఫ్, పాషా, వెంకటేష్ యాదవ్, ఏంట్ల శ్రీను, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

# భీమదేవరపల్లి కేజీబీవీలో హెచ్ఐవీ, ఎస్టీఐ, టీబీ వ్యాధులపై అవగాహన సదస్సు



**భీమదేవరపల్లి, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో మంగళవారం వైఆర్జీ కేర్ ఎల్‌డబ్ల్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎస్టీఐ, టీబీ వ్యాధులపై విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పి. జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఆర్జీ కేర్ సీఎల్‌డబ్ల్యూ ప్రతినిధి కే. లలిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కే. లలిత మాట్లాడుతూ, "హెచ్ఐవీ అనేది సాధారణ అంటువ్యాధి కాదు. కొన్ని నిర్దిష్ట మార్గాల ద్వారా మాత్రమే వ్యాపిస్తుంది" అని వివరించారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, స్టెరిలైజ్ చేయని సూదులు మరియు సిరంజిల వినియోగం, పరీక్షించని రక్తాన్ని ఎక్కించడం, హెచ్ఐవీ ఉన్న తల్లి నుంచి శిశువుకు వ్యాపించడం వంటి నాలుగు ప్రధాన మార్గాల ద్వారా ఈ వైరస్ సంక్రమిస్తుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ, ఎస్టీఐ, టీబీ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఆరు నెలలకొకసారి సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షలకు సంబంధించిన వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతారని పేర్కొన్నారు.
హెచ్ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష చూపడం, వారిని కించపరచడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బాధితుల పట్ల వివక్ష ప్రదర్శించినట్లయితే జరిమానా, జైలు శిక్షలు విధించే అవకాశం ఉందని తెలిపారు. హెచ్ఐవీ, ఎస్టీఐ, టీబీలకు సంబంధించి మరిన్ని వివరాల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1097ను సంప్రదించవచ్చని, క్యూఆర్ కోడ్ ద్వారా కూడా సమాచారం పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పి. జ్యోతి, వైఆర్జీ కేర్ ప్రతినిధి కే. లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గట్లనర్సింగాపూర్‌లో నూతన బస్‌షెల్టర్ నిర్మాణానికి ఆర్టీసీ అధికారుల పరిశీలన



**భీమదేవరపల్లి, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** గట్లనర్సింగాపూర్ గ్రామంలో నూతన బస్‌షెల్టర్ నిర్మాణానికి ఆర్టీసీ అధికారులు మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ భానుప్రసాద్ బస్‌షెల్టర్ ప్రాంతాన్ని పరిశీలించి నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక వివరాలను సేకరించారు. గ్రామంలోని బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి, ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా ఆధునిక వసతులతో నూతన బస్‌షెల్టర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.హామీ అమలులో భాగంగా ఆర్టీసీ అధికారులు స్థలాన్ని పరిశీలించి నిర్మాణానికి అవసరమైన వివరాలను సేకరించారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈఈ శ్రీకాంత్, ఏఈ మల్లారెడ్డి, సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్, ఉపసర్పంచ్ బొడిగె శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గుడికందుల మధు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నాల మురళి, వార్డు సభ్యులు బొల్లంపల్లి షెడ్రెక్, కాసనగొట్టు సాయిరాం, బొల్లంపల్లి సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.





# మద్దిగట్లలో వైభవంగా పోచమ్మ బోనాల పండుగ

**పెద్దమందడి,ఆగస్టు25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామంలో పోచమ్మ బోనాల పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించారు.డప్పు వాయిద్యాలు, మంగళ వాయిద్యాల నడుమ సాగిన బోనాల ఊరేగింపుతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతంగా నిర్వహించారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

- **నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం: ప్రణవ్**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇందులో భాగంగా జమ్మికుంట మండలం గంద్రపల్లి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ బీరెందర్‌తో పాటు సుమారు 50 మంది కార్యకర్తలు, కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.
మండల అధ్యక్షుడు పరశురాం ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కాంగ్రెస్



పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్ వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై విశ్వాసంతోనే ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేస్తామని ప్రణవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరశురాం, కార్తీక్, సీనియర్ నాయకులు సాయిని రవి, పొనగంటి మల్లయ్య, గూడూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్

- **పచ్చదనంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్ సాధ్యం**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట పట్టణ పరిధిలోని శ్రీ మల్లికార్జున స్వామి (దుబ్బ మల్లన్న) దేవాలయ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మొక్కలు నాటారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "తల్లి జన్మనిస్తే.. చెట్టు పునర్జన్మనిస్తుంది" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు.




ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటి చుట్టూ ఎక్కువ సంఖ్యలో మొక్కలు ఉంటే స్వచ్ఛమైన గాలి లభించడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి కుటుంబం తమకు సాధ్యమైనంత మేర పండ్ల మొక్కలు, పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు కేవలం ఒక కుటుంబానికే కాకుండా చుట్టుపక్కల ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. వన మహోత్సవం స్ఫూర్తితో పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, దేవాలయ చైర్మన్ ముద్దమల్ల రవి, కమిటీ సభ్యులు, సైదాబాద్ సర్పంచ్ రాజారాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆర్ఐ భాస్కర్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, కార్యాలయ సిబ్బంది, ఆర్పీలు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వావిలాల పీహెచ్‌సీలో వొడితల ప్రణవ్ ఆకస్మిక తనిఖీ





- **ఆసుపత్రి నిర్వహణపై ఆగ్రహం..**
- **పేదలకు వైద్యంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండల పరిధిలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన ఆయన అక్కడి పరిస్థితులు, ఆసుపత్రి నిర్వహణ తీరును పరిశీలించారు.
ఈ సందర్భంగా పేదలకు అందుతున్న వైద్య సేవలపై రోగులు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణ తీరుపై సంబంధిత అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ప్రణవ్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు అందాల్సిన వైద్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. వైద్య సేవల్లో లోపాలు, ఆసుపత్రి నిర్వహణలో నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రణవ్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వావిలాల సర్పంచ్ అర్జున్, మండల అధ్యక్షుడు పరశురామారావు, పొనగంటి మల్లయ్య, సారంగపాణి, సజ్జు జమ్మికుంట, వావిలాల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# వనమహోత్సవంలో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు

**వీణవంక, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాసారపు సరోజన, ఎంపీడీవో రవి సుధాకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వారు సూచించారు. పచ్చదనం పెంపొందించడంతో ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు "పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు" అంటూ నినాదాలు చేస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేశ్, వార్డు సభ్యులు, ఐకేపీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కెమిస్ట్రీలో డ్యాగల శాలినికి డాక్టరేట్



**భీమదేవరపల్లి, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** ముల్కనూర్‌కు చెందిన డ్యాగల శాలిని కెమిస్ట్రీ విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించి అరుదైన ఘనతను అందుకున్నారు. హైదరాబాద్‌లోని BITS Pilani కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ సుబిత్ కుమార్ సాహా పర్యవేక్షణలో "Design and PhysicoChemical Insights of Surfactant and Polymer Based Hybrid Nanomaterials for Advanced Pharmaceutical Applications" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పొందారు

ఉన్నత విద్య లక్ష్యంగా BITS Pilani పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి ప్రవేశం పొందిన శాలిని, నానో మెడిసిన్ అభివృద్ధిపై పరిశోధన చేశారు. ముఖ్యంగా క్యాన్సర్ చికిత్స, జన్యు పంపిణీ (Gene Delivery), న్యూరో డీజెనరేటివ్ వ్యాధుల చికిత్సకు ఉపయోగపడే నానో మెటీరియల్స్ అభివృద్ధిపై ఆమె పరిశోధనలు కొనసాగించారు. పరిశోధనా కాలంలో అంతర్జాతీయ జర్నల్స్‌లో 11 పరిశోధనా పత్రాలు, ఒక అధ్యయన పుస్తకాన్ని ప్రచురించడంతో పాటు 5 పేటెంట్లు దాఖలు చేశారు. ప్రతిష్ఠాత్మక TEEP ఫెలోషిప్‌ను అందుకుని తైవాన్‌లోని National Cheng Kung University (NCKU)లో పరిశోధన నిర్వహించారు. ముంబైలోని BARC, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (HCU)లో పరిశోధనా ఇంటర్న్‌షిప్‌లు పూర్తి చేశారు.

ముంబై, కేరళ, గోవా, రాయ్‌పూర్, కర్ణాటక, చెన్నై తదితర ప్రాంతాల్లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులు, పరిశోధనా సమావేశాల్లో పాల్గొని తన పరిశోధనలను శాస్త్రవేత్తలకు వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ పోస్టర్ ప్రజెంటేషన్, ఉత్తమ ఓరల్ ప్రజెంటేషన్ అవార్డులతో పాటు బంగారు పతకం, నగదు బహుమతులు కూడా అందుకున్నారు. శాలిని పరిశోధనా ప్రతిభను గుర్తించిన చైనాలోని ప్రతిష్ఠాత్మక Harbin Institute of Technology, Shenzhen Institute సంస్థల నుంచి రెండు పోస్ట్‌డాక్టోరల్ అవకాశాలతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగావకాశాలు లభించడం విశేషం.

తన కూతురు వంశంలోనే మొట్టమొదటి పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించడం గర్వంగా ఉందని తండ్రి డ్యాగల సారయ్య, తల్లి డ్యాగల సత్యవతి, సోదరుడు డ్యాగల సాయి పవన్ తెలిపారు. సమాజంలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మానవాళికి ఉపయోగపడే నానో క్యాన్సర్ మెడిసిన్ అభివృద్ధిపై శాలిని పరిశోధనలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు.

శాలిని సాధించిన ఘనతపై తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ సలహాదారు డాక్టర్ ఏరుకొండ నరసింహస్వామి, తెలంగాణ ఉపాధ్యాయ మిత్ర మండలి అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాసగాని సురేష్, ఆర్థిక కార్యదర్శి వలస సతీష్ తదితరులు హర్షం వ్యక్తం చేసి శాలినికి అభినందనలు తెలిపారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**పెద్దమందడి, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుందని పెద్దమందడి ఎస్ఐ పి. జలంధర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డాకుల మండలం బలిద్‌పల్లి గ్రామానికి చెందిన రవి (50), తండ్రి రాములు, వెల్టూర్ గ్రామ సమీపంలోని ఎన్‌హెచ్ 44 రహదారిపై నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద వివరాలను పరిశీలించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించేందుకు చర్యలు చేపట్టి, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జలంధర్‌రెడ్డి వెల్లడించారు.







# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- **స్కాలర్‌షిప్ విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న దానం కాదు: పీడీఎస్‌యూ**
- **పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్లను తక్షణమే చెల్లించాలని డిమాండ్**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం జమ్మికుంటలో భారీ ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అధ్యక్షతన జమ్మికుంట బస్టాండ్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ కొనసాగింది. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని తమ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోలా మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న దానం కాదని, అది వారి విద్యా హక్కు, ప్రభుత్వ సామాజిక బాధ్యత అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం బాధాకరమన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు పరీక్ష ఫీజులు, పుస్తకాలు, ప్రయాణ ఖర్చులు, హాస్టల్ ఫీజులు, ప్రయోగశాలలు, ఇతర విద్యా సౌకర్యాల ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల కారణంగా ఇంజినీరింగ్, వైద్య, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ విద్యార్థుల్లో కొందరు చదువులు మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వాలు స్కాలర్‌షిప్‌లను కేవలం సంక్షేమ పథకంగా కాకుండా సామాజిక సమస్యగా, సామాజిక బాధ్యతగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే కమిటీలు, ఇతర కారణాలతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. విద్యా సంస్థలు బంద్‌లు నిర్వహించినా, విద్యార్థులు మంత్రుల ఇళ్లను ముట్టడించినా ప్రభుత్వ వైఖరిలో మార్పు రావడం లేదని అన్నారు.

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి కోర్టులు ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తోందని అనిల్ సాయిబోలా ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేద విద్యార్థులకు ఆర్థిక భరోసాగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్లను తక్షణమే విద్యార్థులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అనంతరం పీడీఎస్‌యూ నిర్మాణం, విద్యారంగ సమస్యలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకిని మల్లేష్, జిల్లా నాయకులు తాళ్లపల్లి విష్ణు, యశ్వంత్, వంశీ, శ్రీవిద్య, సంజన, అనన్య తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ఖైదీల విడుదలకు 29న ఇందిరాపార్క్ వద్ద ధర్నా




**హైదరాబాద్, ఆగస్టు 25, (తెలంగాణ ముచ్చట్లు):** రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, ఉపా చట్టం, ఎన్ఐఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు.

మంగళవారం జవహర్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఆదివాసీలు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, తెలంగాణ ఉద్యమకారులు, ముస్లిం మైనారిటీలపై నమోదైన తప్పుడు కేసులను ఎత్తివేసి, రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జవహర్‌నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజా ఉద్యమకారులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేయాలని కోరారు. 29న ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, పీఓడబ్ల్యూ తదితర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయి, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- **మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..**
- **హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి**



**వీణవంక, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, సైబర్ మోసాలు, అపరిచితుల ఫోన్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్, వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి సూచించారు. వీణవంక మండలం కోర్కల్ గ్రామంలో మంగళవారం వారి ఆధ్వర్యంలో కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్థులతో మాట్లాడి గ్రామంలో శాంతిభద్రతలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు, మత్తు పదార్థాల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలు, గోప్య సంకేతాలు ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

గ్రామస్థులతో నేరుగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రజలకు పోలీసు సేవలపై అవగాహన కల్పించడం కమ్యూనిటీ మీటింగ్‌ల ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.

# పచ్చని చెట్లతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు

- **పలుస శంకర్ గౌడ్, జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**



**వనపర్తి, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి మండలంలోని తిరుమలయ్యగట్టు రేడియంట్ ఉన్నత పాఠశాల ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు వలస శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పుట్టిన రోజు, వివాహం వంటి శుభకార్యక్రమాల్లో మొక్కలు నాటడాన్ని సంప్రదాయంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రకృతిని ప్రేమించి, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెరిగితే భూగర్భ జలాలు వృద్ధి చెంది, సకాలంలో వర్షాలు కురిసి రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సంచాలకులు కౌసల్య భాస్కర్, ప్రధానోపాధ్యాయులు ఉప్పరి తిరుమలేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సాహితీ కళావేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పెళ్లయిందని చెప్పగానే సినిమా ఛాన్స్ మిస్!



**హైదరాబాద్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** బిగ్‌బాస్ షో ద్వారా పాపులర్ అయిన స్రవంతి చొక్కారపు ప్రస్తుతం యాంకర్‌గా బిజీగా ఉంటూనే సినిమాల్లోనూ అవకాశాలు అందుకుంటున్నారు. తాజాగా ఆమె నటించిన 'హే బలవంత్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పెళ్లయిందని చెప్పడం వల్ల ఓ భారీ సినిమా అవకాశాన్ని కోల్పోయానని ఆమె చెప్పడం ఇప్పుడు వైరల్‌గా మారింది.

స్రవంతికి ఓ ప్రముఖ తమిళ నటుడి కుమారుడి తొలి సినిమాలో హీరోయిన్‌గా నటించే అవకాశం వచ్చిందట. ఇందుకోసం స్క్రీన్ టెస్ట్ నిర్వహించడంతో పాటు హీరో పక్కన నిలబెట్టి ఫొటోలు కూడా తీశారని తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, తనను హీరోయిన్‌గా కూడా ఫిక్స్ చేశారని వెల్లడించారు. మరుసటి రోజు చెన్నై వెళ్లి షూటింగ్‌లో పాల్గొనాలని, అక్కడే అడ్వాన్స్ తీసుకోవాలని చెప్పారట.

చెన్నై వెళ్లే ముందు సినిమా మేనేజర్‌తో మాట్లాడుతున్న సమయంలో తనకు పెళ్లయిందనే విషయాన్ని స్రవంతి చెప్పారట. దీంతో మేనేజర్ ''ఒక గంటలో మీకు కాల్ చేస్తాను'' అని చెప్పి ఆ తర్వాత తిరిగి ఫోన్ చేయలేదని తెలిపారు. చివరకు ఆ సినిమా అవకాశం కూడా తనకు దక్కలేదని స్రవంతి వెల్లడించారు. పెళ్లయిందని చెప్పడంతోనే ఆ అవకాశాన్ని కోల్పోయానని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

# రాఖీ ప్రకటనతో కృతి సనన్‌పై ట్రోలింగ్

**హైదరాబాద్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** బాలీవుడ్ నటి కృతి సనన్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. అయితే తాజాగా ఆమె తన సినిమాల కారణంగా కాకుండా ఓ ప్రకటనతో వార్తల్లో నిలిచారు. రక్షాబంధన్ సందర్భంగా ఓ నగల సంస్థ కోసం రూపొందించిన ప్రకటనలో నటించిన కృతి సనన్‌పై కొందరు నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. పండుగను ప్రకటనలో చూపించిన తీరుపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**దుస్తులపై నెటిజన్ల అభ్యంతరాలు**

ఈ ప్రకటనలో కృతి సనన్ ఆఫ్‌వైట్ రంగు దుస్తుల్లో కనిపించారు. పండుగ సందర్భానికి ఆమె ధరించిన దుస్తులు సరిపోతాయా అంటూ కొందరు నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. రక్షాబంధన్ వంటి సంప్రదాయ పండుగను ప్రచారంలో చూపించే సమయంలో మరింత సంప్రదాయబద్ధమైన దుస్తులు ధరించి ఉంటే బాగుండేదని కొందరు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం దుస్తుల విషయంలో విమర్శలు చేయడం సరికాదని అంటున్నారు.

**కుక్కకు రాఖీ కట్టడంపైనా చర్చ**

ప్రకటనలో కృతి సనన్ తన పెంపుడు కుక్కకు రాఖీ కట్టే సన్నివేశం కూడా ఉంది. దీనిపైనా సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. పండుగ సంప్రదాయాలను ఇలా చూపించడం సరికాదంటూ కొందరు విమర్శిస్తుండగా, పెంపుడు జంతువులను కుటుంబ సభ్యులుగా భావించేవారికి ఇందులో తప్పేమీ లేదని మరికొందరు సమర్థిస్తున్నారు. దీంతో ఈ ప్రకటనపై సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలు కనిపిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, ఈ ట్రోలింగ్ కొనసాగుతున్న సమయంలోనే కృతి సనన్ సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలను పంచుకున్నారు. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆ ఫొటోలు కూడా ప్రస్తుతం వైరల్‌గా మారాయి. ప్రకటనపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో కృతి సనన్ స్పందిస్తారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.



# ఇరుముడితో స్వాసికకు తెలుగులో బ్రేక్!

హైదరాబాద్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు): మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ డివోషనల్ ఎమోషనల్ థ్రిల్లర్ డ్రామాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. సినిమాలో రవితేజతో పాటు బేబీ నక్షత్ర నటనకు ప్రశంసలు దక్కుతుండగా.. టీచర్ పాత్రలో నటించిన మలయాళ నటి స్వాసిక కూడా ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు.

స్క్రీన్‌పై కనిపిస్తే కోపం తెప్పించేలా.. 'ఇరుముడి'లో టీచర్‌గా స్వాసిక పోషించిన పాత్ర ప్రేక్షకుల్లో బలమైన ప్రభావం చూపిస్తోంది. ఆమె పాత్రపై ప్రేక్షకులకు కోపం వచ్చేంత సహజంగా నటించడంతో.. స్వాసిక నటనకు ప్రశంసలు దక్కుతున్నాయి. పాత్రను కేవలం నటించకుండా అందులో పూర్తిగా ఒదిగిపోయారని అభిమానులు అంటున్నారు. దీంతో ప్రస్తుతం నెటిజన్లు స్వాసిక గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**13 ఏళ్ల తర్వాత తెలుగులో రీఎంట్రీ..**

స్వాసిక తమిళం, మలయాళ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు. తెలుగులో మాత్రం ఆమె ప్రయాణం 2012లో 'ఎటు చూసినా నువ్వే' సినిమాతో ప్రారంభమైంది. సాయి క్రిష్ హీరోగా నటించిన ఈ చిత్రంలో ఆమె కథానాయికగా కనిపించారు. అయితే ఆ సినిమా పెద్దగా గుర్తింపు పొందకపోవడంతో ఆ తర్వాత దాదాపు 13 ఏళ్ల పాటు తెలుగులో కనిపించలేదు. గతంలో 'తమ్ముడు', 'శంబాల' వంటి చిత్రాల్లో నటించిన స్వాసికకు ఇప్పుడు 'ఇరుముడి' మంచి గుర్తింపును తీసుకొచ్చింది. దీంతో రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో ఆమెకు మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశం ఉందని సినీ అభిమానులు భావిస్తున్నారు.



బుధవారం - 26 - ఆగస్టు 2026
తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి



- జిల్లెల్ల ఆదిత్య రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు

**వనపర్తి,ఆగస్టు25(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఏఐపీసీ అధ్యక్షులు, వనపర్తి నియోజకవర్గ యువ నాయకులు డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి అన్నారు.టీపీసీసీ సోషల్ మీడియా నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పెట్టం నవీన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆదిత్యరెడ్డి హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నవీన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆదిత్యరెడ్డి మాట్లాడుతూ.. యువతను కాంగ్రెస్ పార్టీతో మరింతగా అనుసంధానం చేయడంలో నవీన్ నాయకత్వం కీలకంగా నిలవాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచడంలో సోషల్ మీడియా ఎంతో కీలకమైన సాధనమని తెలిపారు. నవీన్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి మంచి ఫలితాలు సాధిస్తారనే నమ్మకం ఉందన్నారు.నవీన్ పదవీకాలం విజయవంతంగా సాగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టాలని డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి ఆకాంక్షించారు.కార్యక్రమంలో వనపర్తి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, వివిధ జిల్లాల సోషల్ మీడియా విభాగం నాయకులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో సంచలన తీర్పు

- ముగ్గురు కామాంధులకు జీవిత ఖైదు
- నేరం రుజువు కావడంతో భారీ జరిమానా విధిస్తూ ఖమ్మం పోక్సో కోర్టు నిర్ణయం



**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 25(తెలంగాణ ముచ్చట్లు):** బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘోరమైన పోక్సో కేసులో ముగ్గురు నిందితులకు ఖమ్మం మొదటి ఫాస్ట్‌ట్రాక్ (పోక్సో) కోర్టు జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ పుల్లభట్ల పోగడ కృష్ణ అర్జున్ తీర్పును వెల్లడించినట్లు వైరా ఏసీపీ సారంగపాణి తెలిపారు.కేసు వివరాల్లోకి వెళ్తే..చింతకాని మండలంలో 2022 నవంబర్ 18న ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ చిన్నారిని, ఎదురింట్లో నివాసముంటున్న పాలకుర్తి శ్రీవర్ధన్ అనే యువకుడు మాయ మాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం తన స్నేహితులైన సిమ్మసార్తి నాగరాజు, పాలకుర్తి వీరన్నలతో కలిసి బాలికపై బెదిరింపులకు దిగి లైంగిక దాడికి ఒడిగట్టారు.ఈ విషయాన్ని బయటకు చెబితే ప్రాణాలు తీస్తామని బాధితురాలిని భయభ్రాంతులకు గురిచేశారు. దీనిపై బాధితురాలి తల్లి ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయడంతో చింతకాని పోలీసులు క్రైం నెంబర్ 152/2023తో ఐపీసీ సెక్షన్లు 376, 324, 506 r/w 34 తో పాటు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

**నిందితులకు ఖైదు, భారీ జరిమానా**

అప్పటి వైరా ఏసీపీ ఎం.ఏ. రహమాన్ పక్కా ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె. శరత్ కుమార్ రెడ్డి ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించారు.సాక్ష్యాధారాలు, వైద్య నివేదికలను పరిశీలించిన న్యాయస్థానం నేరం రుజువు కావడంతో ఎ1 పాలకుర్తి శ్రీవర్ధన్ (19), ఎ2 సిమ్మసార్తి నాగరాజు (20), ఎ3 పాలకుర్తి వీరన్న అలియాస్ అభి (20)లకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది.దీనితో పాటు ఎ1కు రూ. 65,000, ఎ2 మరియు ఎ3లకు చెరో రూ. 60,000 జరిమానా విధించింది.

**సిబ్బందికి పోలీస్ కమిషనర్ అభినందనలు**

ఈ కేసులో పక్కాగా దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్ష పడేలా శ్రమించిన ఏసీపీ రహమాన్, చింతకాని ఎస్ఐ జి. నరేష్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ కె. శ్రీనివాసరావు, లైజన్ ఎస్సై శ్రీకాంత్, హెచ్‌సీలు నాగేశ్వరరావు, శ్రీనివాస్, నాగేశ్వరావు,హోంగార్డులు అయూబ్,చిట్టిబాబులను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రత్యేకంగా అభినందించారు.బాధితులకు న్యాయం జరిగేలా శ్రమించిన పోలీస్ బృందానికి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ఈ నెల 27న జాబ్ మేళా నిర్వహణ....

- జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 25(తెలంగాణ ముచ్చట్లు ):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం వివిసి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఖమ్మంలో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, ఆటోమోటివ్ సర్వీస్ అడ్వైజర్, ఆటోమోటివ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు కల్పించుటకు ఆగస్టు 27న (గురువారం) ఉదయం 10 గంటలకు ఖమ్మం ముస్తఫా నగర్ డిసిసిబి శాంతినగర్ బ్యాంక్ ఎదురుగా ఉన్న వివిసి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బి టెక్, బి.ఈ.అర్హత గల 1828 వయస్సు గల యువతీ, యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 15 వేల నుండి 18 వేల వరకు ఉంటుందని, ఉచిత శిక్షణ, భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. మొత్తం 90 ఉద్యోగ ఖాళీల భర్తీకిగాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి అర్హత గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు హెచ్ ఆర్ సెల్ నెంబర్ 7729992061 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి మాధవి ఆ ప్రకటనలో తెలిపారు.

# వెల్టూర్‌లో అంగరంగ వైభవంగా పోచమ్మ బోనాలు





- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ.. ఆధ్యాత్మిక శోభతో కళకళలాడిన గ్రామం

**పెద్దమందడి,ఆగస్టు25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో పోచమ్మ బోనాల పండుగను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు.అమ్మవారికి నైవేద్యంగా బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో పూజించి గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి.పండుగ సందర్భంగా మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. సంప్రదాయ ఆచారాలు, పూజా కార్యక్రమాలతో వెల్టూర్ గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో పండుగను నిర్వహించడంతో పోచమ్మ బోనాల వేడుకలు కన్నుల పండువగా సాగాయి.

# కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు

- విజయవంతమైన ఏఐటియుసి 17వ మహాసభలు
- ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివరామకృష్ణ, రామాంజనేయులు
- మహాసభల నిర్ణయాలను ప్రకటించిన ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు




**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 25(తెలంగాణ ముచ్చట్లు):** ఆగస్టు 23, 24 తేదీల్లో సత్తుపల్లి పట్టణంలో ఏఐటియుసి 17వ జిల్లా మహాసభలు ఉత్సాహపూరిత వాతావరణంలో విజయవంతంగా జరిగాయని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు తెలిపారు. గిరిప్రసాద్ భవన్లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్ కలిసి శింగు నర్సింహారావు మాట్లాడారు. కార్మికుల హక్కులే లక్ష్యంగా భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలన్నారు. శతాబ్ద కాలంగా పోరాటాలు, త్యాగాలతో కార్మిక వర్గం సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మరల పునరుద్దరించాలన్నారు. కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని కనీస వేతనం రూ. 26వేలు అమలుకై పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక వర్గంపైనే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం అంగన్వాడీలకు రూ.18వేల వేతనం, మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10వేలు అమలు చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ మహాసభలలో ఖమ్మంజిల్లాలో గ్రానైట్ పరిశ్రమను ప్రోత్సహించి ఇండస్ట్రీయల్ కారిడార్ను ఏర్పాటు చేయాలని, ఖమ్మంజిల్లా కేంద్రంగా ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని, సత్తుపల్లిలో ఆటో నగర్ను ఏర్పాటు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టకొట్టే సెంట్రల్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని, ఆటో కార్మికుల సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని తదితర తీర్మానాలను మహాసభఏకగ్రీవంగా ఆమోదించిందని శింగు నర్సింహారావు తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలోని 21 మండలాల నుంచి ఏఐటియుసి అనుబంధ రంగాల నుండి 600 మంది కార్మిక ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివరామకృష్ణ, రామాంజనేయులు

మహాసభల సందర్భంగా ఏఐటియుసి ఖమ్మంజిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని 77 మందితో నూతన కౌన్సిల్, 21 మందితో ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షునిగా రావి శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా తోట రామాంజనేయులు రెండవ సారి ఎన్నికయ్యారన్నారు. జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులుగా గాదె లక్ష్మినారాయణ, ఉప ప్రధాన కార్యదర్శిగా నిమ్మటూరి రామకృష్ణ, కోశాధికారిగా ఏనుగు గాంధీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన నూతన నాయకత్వం భవిష్యత్తులో కార్మిక వర్గ పోరాటాలను నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాదె లక్ష్మినారాయణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పగడాల మల్లేష్, గొడ్డుగొర్ల శ్రీను, కోశాధికారి ఏనుగు గాంధీ, జిల్లా కార్యదర్శులు పేరబోయిన మోహన్రావు, నకిరికంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పతక విజేతలకు సీఎం అభినందనలు







- మహిళల డబుల్స్‌లో కాంస్య పతకం సాధించిన గాయత్రి–ట్రీసా
- జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసిన బ్యాడ్మింటన్ జోడీ
- కోచ్ పుల్లెల గోపీచంద్‌కు ప్రత్యేక అభినందనలు
- తెలంగాణ యువతకు స్ఫూర్తిగా నిలిచిన క్రీడాకారిణులు

**హైదరాబాద్, ఆగస్టు 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించి దేశానికి గౌరవం తీసుకువచ్చిన పుల్లెల గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రపంచ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి భారత క్రీడా రంగానికి మరో గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో గాయత్రి, ట్రీసా జాలీలతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారి విజయాన్ని ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కఠోర శ్రమ, పట్టుదల, క్రమశిక్షణతో ప్రపంచ స్థాయిలో పతకం సాధించడం యువ క్రీడాకారులకు ఆదర్శమని అన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కూడా పాల్గొన్నారు. భారత బ్యాడ్మింటన్ అభివృద్ధిలో గోపీచంద్ పాత్ర ఎంతో కీలకమని ముఖ్యమంత్రి కొనియాడారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ఆయన చేస్తున్న కృషి దేశ క్రీడా రంగానికి గొప్ప ఆస్తిగా నిలుస్తోందని పేర్కొన్నారు.

ప్రపంచ ఛాంపియన్‌షిప్ వంటి అత్యున్నత వేదికపై పతకం సాధించడం సాధారణ విషయం కాదని సీఎం అన్నారు. గాయత్రి, ట్రీసా ప్రదర్శన భారత మహిళల బ్యాడ్మింటన్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు, ప్రోత్సాహకాలు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. క్రీడలను వృత్తిగా ఎంచుకునే యువతకు మరింత అనుకూల వాతావరణం కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీవీ లక్ష్మి పాల్గొన్నారు. ప్రపంచ స్థాయిలో భారత జెండాను రెపరెపలాడించిన గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీల విజయాన్ని అందరూ అభినందించారు. వారి భవిష్యత్తు క్రీడా ప్రస్థానం మరిన్ని విజయాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in